

అభివృద్ధి పనులు షురూ

సారంగాపూర్ : దుబ్బరాజన్న ఆలయంలో చేపట్టిన రాజగోపురం, ప్రాకార మండపం పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.



చందనంతో అభిషేకం

సారంగాపూర్ : బీర్‌పూర్ మండలం కొల్వాయి రామాలయంలో స్వామివారికి శుక్రవారం చందనంతో అభిషేకం చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుంది. పగటి పూట ఎండ తీవ్రత పెరుగుతుంది.

ఎక్కువగా నమ్మటం, ఎక్కువగా ప్రేమించటం, ఎక్కువగా ఆశించటం ద్వారా వచ్చే బాధ కూడా ఎక్కువగానే ఉంటుంది. – మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6.33	ఆది 4.45

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

వెంకన్నకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం రంగు రంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసచార్యులు మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



హన్మాన్ భక్తులతో ముస్లింలు

ధర్మపురి: తీగలధర్మారం గ్రామానికి చెందిన అక్బర్ శుక్రవారం తన నివాసంలో హన్మాన్ భక్తులకు భిక్ష ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. గ్రామస్తులు ఐకమత్యంతో వ్యవహరించేలా, ప్రజలు కుల, మతాలకు అతీతంగా ముందుకు సాగేలా ఆదర్శంగా నిలుస్తున్న అక్బర్‌ను మాజీ సర్పంచ్ తిరుపతి తదితరులు ప్రశంసించారు. ఈకార్యక్రమంలో హన్మాన్ భక్తులు, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సంక్షేమాధికారి నరేశ్

జగిత్యాల: ఆనందం, ఆరోగ్యానికి యోగా సాధన మార్గదర్శిని అని సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఎల్జీ గార్డెన్స్‌లో పట్టణ, రూరల్, అర్బన్ అంగన్‌వాడీ టీచర్లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రతీరోజు యోగా సాధనతో శరీరంలోని బాహ్య, అంతర భాగాల్లో ప్రతీజీవ కణాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. ఆలోచన, జ్ఞాపక శక్తిని కచ్చితంగా పెంచుతుందని ఆయన తెలిపారు. సీడీపీవో వీరలక్ష్మీ మాట్లాడుతూ, స్వస్థ బాలక్ స్పర్శ కార్యక్రమం ద్వారా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా శిక్షణ ఇవ్వాలన్నారు. రక్తహీనత, ఐరన్, విటమిన్– సీ లోప నివారణకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించాలని సీడీపీవో సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాణి, జానకి, స్వరూపరాణి, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ మధు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

జగిత్యాల: జిల్లాలో నిర్వహిస్తున్న వెలుగు శిబిరాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. మున్సిపల్‌లోని 8, 9 వార్డుల్లో చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాల ద్వారా పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నరేశ్ ఉన్నారు.

'ఒంటిపూట'కు ఎగనామం



ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు(ఫైల్)

- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పట్నుంచే పదో తరగతి క్లాసులు
- విద్యార్థులపై భారం
- పట్టించుకోని విద్యాశాఖ

జగిత్యాల: ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 15 నుంచి ఒంటిపూట సెలవులు ప్రకటించింది. ఏప్రిల్ 24 వరకు ఒంటిపూట అనంతరం పరీక్షల నిర్వహణ తర్వాత సెలవులు ఉండనుండగా, జూన్ 11న రీ ఓపెన్ అవుతాయి. కానీ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా రెండుపూటలా తరగతులు నిర్వహిస్తున్నారు. అయినా విద్యాశాఖ పట్టించుకోకపోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలల ఎదుట ఆందోళన చేసినా ఫలితం లేకుండాపోతోంది.

విద్యార్థులపై భారం

- ఒకవైపు ఎండలు మండుతుండగా కొన్ని పాఠశాలల నిర్వహకులు విద్యార్థులపై భారం మోపుతున్నారు.
- ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక క్లాసులు తీసుకుంటే దానిపై ఎవరికీ అభ్యంతరం ఉండదు.
- కానీ కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు.. ఒకటి నుంచి పదో తరగతి వరకు రెండుపూటలా కొనసాగిస్తున్నాయి.

విద్యార్థి సంఘాల ఆందోళన

జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు నిత్యం రెండుపూటలు తరగతులు నిర్వహిస్తూ ప్రభుత్వ జీవోను తుంగలో తొక్కుతున్నాయని ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవ డం లేదు. ఇటీవల కలెక్టరేట్ ఎదుట సైతం ఆందోళన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అయినా ప్రైవేటు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆరోపణ లున్నాయి.

- ఇప్పటినుంచే తొమ్మిదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తిచేసి పదో తరగతి సిలబస్ సైతం ప్రారంభించారు.
- దానికి సంబంధించిన సిలబస్ బుక్స్ తెచ్చుకోవాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండగా, తల్లిదండ్రులు కూడా ఆర్థికంగా పలు ఇబ్బందులకు గురవుతున్నారు.
- తొమ్మిదో తరగతి సిలబస్ పూర్తియి పదో తరగతి విద్యాబోధన నిర్వహిస్తుండటంతో కొన్ని పాఠశాలల నిర్వాహకులు ఇప్పటినుంచే ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం వివాదాస్పదమవుతోంది.
- కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కనీసం మౌలిక వసతులు కూడా కల్పించడంలేదు.
- ప్రస్తుతం ఉదయం 11 గంటలు దాటిందంటే ఎండతీవ్రత పెరుగుతోంది.
- తరగతి గదుల్లో ఉక్కపోతతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
- ఇటీవల ఎండవేడిమి తట్టుకోలేక ఓ విద్యార్థి స్పృహతప్పి పడిపోయిన ఘటన సైతం ఓ ప్రాఠశాలలో చోటుచేసుకుంది.
- కొన్ని స్కూళ్లలో రేకుల గదులు ఉండటం, కనీసం చల్లని నీరు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ధనార్జనే ధ్యేయంగా..

- కొన్ని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- ఈ టెక్నో, ఐటీ, డీజీ తోకలు తగిలిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు.
- కొన్నిస్కూళ్లలో కనీసం ఆటస్థలాలు కూడా లేని పరిస్థితి నెలకొంది.
- అయినా విద్యాశాఖ అధికారులు ఆమ్యామ్యాలు పొందుతూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.
- అలాగే ఏటా ప్రైవేటు స్కూల్ నిర్వాహకులు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.
- అందులో మౌలిక వసతులున్నాయా, నిబంధనలు పాటిస్తున్నారా? అని పరిశీలించిన తర్వాతే రెన్యూవల్ ఇవ్వాల్సి ఉంటుంది.
- ఇవన్నీ ఏమీ లేకుండానే అధికారులు రెన్యూవల్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు పాటించ కుంటే చర్యలు



ప్రతీ పాఠశాల ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలి. విద్యార్థులపై భారం వేయొద్దు. ఒంటిపూట బడులు కచ్చితంగా నిర్వహించాలి. కొన్ని పాఠశాలలు రెండు పూటల తరగతులు నిర్వహిస్తున్నారనే విషమయం మా దృష్టికి వచ్చింది. ఇలాంటివాటిపై చర్యలు తీసుకుంటాం. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేస్తే తప్పులేదు. కానీ ఒకటినుంచి పదో తరగతి వరకు ఇప్పుడే తరగతులు నిర్వహించకూడదు.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

కొత్త రేషన్‌షాపుల జాడేది?

- ప్రభుత్వానికి నివేదించినా మంజూరు కాలేదు
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు

జిల్లాలో రేషన్ సమాచారం	
దుకాణాలు	592
ఆహారభద్రత	3,07,619
అంత్యోదయ	14,500
అన్నపూర్ణ	146
ఖాళీగా ఉన్నవి	99
అందిన దరఖాస్తులు	10



జగిత్యాలరూరల్: జిల్లాలో కొత్తగా రేషన్ దుకాణాల ఏర్పాటు అనివార్యమైనా ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. చాలాగ్రామాల ప్రజలు సుదూరంలోని మేజర్ పంచాయతీలకు వెళ్లి ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకొని వస్తున్నారు. ఇందుకోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణిస్తూ, అధిక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఈ పరిస్థితి నుంచి తమకు విముక్తి కల్పించాలని రేషన్‌కార్డులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.

జిల్లాలో 592 రేషన్ షాపులు..

- జిల్లాలో 592 షాపులు ఉండగా, వాటి పరిధిలో ఆహార భద్రత కార్డులు 3,07,619, అంత్యోదయ కార్డులు 14,500, అన్నపూర్ణ కార్డులు 146 ఉన్నాయి.
- నింబంధనల ప్రకారం 500 నుంచి 600 రేషన్ కార్డులకు ఒకరేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి.
- ఈలెక్కన మరికొన్ని రేషన్ షాపులు అవసరం.

99 షాపులు ఖాళీ..

జిల్లాలో 99 షాపులకు డీలర్లే లేరు. సరుకుల పంపిణీలో అక్రమాలు, అవకతవకలు, డీ లర్లు మృతి చెందడం, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండడం తదితర కారణాలతో రెండు, మూడు షాపులను ఒకే డీలర్ రేషన్ పంపిణీ చేయాల్సి వస్తోంది. పంపిణీలో ఆలస్యం కావడంతో గడువు లోపు లబ్ధిదారులు సరుకులు తీసుకోలేకపోతున్నారు.

సమస్యలు అనేకం..

- జిల్లాలో కొత్తగా 53 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి.
- కొత్తగా ఏర్పాటైన పల్లెల్లో ఇంకా రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయలేదు.
- దాదాపు 5 కి.మీ. నుంచి 10 కి.మీ. దూరంలోని మేజర్ గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులు ప్రతినెలా రేషన్ తీసుకొస్తున్నారు.
- కొత్తగా 10 రేషన్ దుకాణాల కోసం కొందరు దరఖాస్తు చేసుకున్నారు.
- ఇప్పటివరకు కొత్త రేషన్ దుకాణాలు మంజూరుకు నోచుకోవడం లేదు.
- రెండు, మూడు దుకాణాలకు ఒక్కరే ఇన్‌చార్జి డీలర్ ఉండడంతో దుకాణాలను ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో తెలియడంలేదు.
- కొన్ని సందర్భాల్లో స్పష్టమైన సమాచారం లేక సరుకుల కోసం వచ్చి దుకాణం మూసిఉండడంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.
- ప్రతినెలా 15వ తేదీలోపే లోపే సరుకులు పంపిణీ చేస్తున్నారు.
- బయోమెట్రిక్ మిషన్లు ఒక్కోసారి నెట్‌వర్క్ సమస్యతో పనిచేయడంలేదు.
- దీంతో ఆ నెలలో లబ్ధిదారులకు సరుకులు అందడంలేదు.

ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిడి..

- జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన వాటితోపాటు మేజర్ గ్రామపంచాయతీల్లో అదనంగా రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. కొత్తవాటి ఏర్పాటుకు కృషి చేస్తామని వారు కూడా ప్రజలకు హామీ ఇస్తున్నారు. కానీ, నేటికీ కార్యరూపం దాల్చడంలేదు.

అనుమతి రాగానే ఏర్పాటు

జిల్లాలో పది రేషన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు అందాయి. వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు జాబితా పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేస్తాం. అయితే, జిల్లాలో 99 రేషన్ దుకాణలకు డీలర్లులేరు. అయినా, ఇన్‌చార్జిలను నియమించి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయిస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.చందన్‌కుమార్, డీఎస్‌వో

ఇథనాల్ పరిశ్రమతో ప్రయోజనాలు



ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు భూమిపూజ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- రాష్ట్రసంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- స్తంభంపల్లిలో ఫ్యాక్టరీ స్థాపనకు భూమిపూజ

వెల్గటూర్(ధర్మపురి): జిల్లాలో ఇథనాలు పరిశ్రమ ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక రకాల మేలు జరుగుతుందని రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. స్తంభంపల్లి గ్రామ శివారులో సుమారు 110 ఎకరా విస్తీర్ణంలో రూ.700 కోట్ల అంచనా వ్యయంతో స్థాపించే ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ నిర్మాణానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం భూమిపూజ చేశారు. తొలిదశలో రూ.13కోట్ల వ్యయంతో చేపట్టిన గుట్ట చదును పనులు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ క్రిభ్‌కో, రాష్ట ప్రభుత్వం సంయుక్తంగా పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ఏటా 8 కోట్ల లీటర్ల సామర్థ్యం గల ఇథనాల్ తయారవుతుందని తెలిపారు. ఇంత పెద్దఫ్యాక్టరీ మనప్రాంతానికి రావడం అదృష్టమన్నారు. పరిశ్రమ స్థాపించాక ఈప్రాంతం గణనీయమైన అభివృద్ధి చెందుతుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ బి.సుధారాణి, సర్పంచులు చల్లూరి రూపారాణి, బొప్పు తిరుపతి, ఎంపీటీసీ పొడేటి సతీశ్, బీఆర్‌ఎస్ వెల్గటూర్, ఎండపల్లి మండలాల అధ్యక్షులు చల్లూరి రాంచందర్, సింహాచలం జగన్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం

- కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో ఈ యాసింగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. యాసంగి –2022–23 ధాన్యం కొనుగోలు కమిటీతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. యాసంగిలో సుమారు 1,18,040 హెక్టార్లలో వరి సాగు చేశారని కలెక్టర్ తెలిపారు. ఏ–గ్రేడ్ క్వింటాలుకు రూ.2,060, సధారణ రకం రూ.2,040 మద్దతు ధర చెల్లించాలని సూచించారు. ఐకేపీ నుంచి 144, పీఏసీఎస్‌ల నుంచి 275 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని వెల్లడించారు. ప్రతీ కేంద్రంలో రెండు ప్యాడీ క్లీనింగ్ మిషన్లు అందుబాటులో ఉంచాలని, టోకెన్ పద్ధతి పాటించాలని, రైతులకు టార్పాలిన్ కవర్లు అందజేయాలని అన్నారు. ఎఫ్ఏకే నిబంధనలు పాటించాలని, బస్తాకు 40.650 కేజీల తూకం వేయాలని చెప్పారు. నూతన ట్యాబ్‌లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో నీడ, మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. విద్యుత్ కనెక్షన్ ఉండాలని, ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైస్‌మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెలక్టర్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడురోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేయాలని సూచించారు. జిల్లాలోని 63 బాయిల్డ్ రైస్‌మిల్లులు యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తున్నాయని వెల్లడించారు. ప్రతీమిల్లులో 50 – 60 మది హమాలీలు నియమించుకోవాలని సూచించారు. మిల్లుకు చేరిన లారీ నుంచి ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని అన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాల ప్రకారం లేకుంటే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిల సాయంతో రైతులకు టోకెన్లు జారీచేయాలని ఏఈవోలను ఆదేశించారు. అదనపు కలెక్టర్ లత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో నేటినుంచి పోలీస్ యాక్ట్

- ఎస్పీ భాస్కర్
- శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ సూచించారు. అత్యవసర కార్యక్రమాల నిర్వహణకు ముందస్తుగా పోలీసు నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. వివిధ కారణాలతో ర్యాలీలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిళ్లు తేవడం, బెదిరింపులకు గురిచేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్నివర్గాల ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

5నుంచి ప్రముఖుల జయంతి ఉత్సవాలు

జగిత్యాల: జిల్లాలో ఈనెల 5వ తేదీనుంచి ప్రముఖుల జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 5న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. వీటి నిర్వహణకు అనుసరించాల్సిన విధానాలపై ఈనెల 1న కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. దళిత సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

ప్రజాధనం పక్కదారి!

- తాత్కాలిక షెడ్ నెట్లకు రూ.లక్షలు
- చిన్నపాటి గాలులకే ధ్వంసమవుతున్న వలలు
- అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు
- శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని డిమాండ్

పెగడపల్లి(ధర్మపురి): జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వన నర్సరీల్లో మొక్కలకు నీడ కల్పించేందుకు వెచ్చిస్తున్న ప్రజాధనం షెడ్ నెట్ల పాలవుతోంది. శాశ్వత ప్రాతిపదికన కాకుండా తాత్కాలికంగా షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తుండటంతో చిన్నపాటి ఈదురుగాలులకే వలలు చిరిగిపోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించినా ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఫలితంగా ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. శాశ్వత ప్రాతిపదికన షెడ్‌నెట్లు ఏర్పాటు చేయాలని, ఇందుకోసం నాణ్యమైన వలలు ఎంపిక చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

380 గ్రామాలు.. 2కోట్ల మొక్కలు..

- జిల్లాలో 380 గ్రామ పంచాయతీ ఉన్నాయి. వీటన్నింటిలో ప్రభుత్వం వన నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతోంది.
- ఈ ఏడాదిలో సుమారు 2 కోట్ల వరకు మొక్కలు పెంచుతున్నారు.
- ఎండకాలంలో వాటి సంరక్షణ కోసం నీడ కల్పించాల్సిన అవసరం ఏర్పడుతోంది.
- ఇందు కోసం షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రామ పంచాయతీలకు సమకూరుతున్న నిధుల్లోంచి కొంత సొమ్ము వెచ్చించి షెడ్ నెట్లు కొనుగోలు చేస్తున్నారు.
- హరితహారం మొక్కల పెంపకం కోసమని గ్రీన్‌ఫండ్ పేరిట ఈ నిధులు ఖర్చు చేస్తున్నారు.
- ఒక్కో నర్సరీకి కనీసం 5 నుంచి 10 షెడ్‌నెట్ల వరకు అవసరమవుతున్నాయి.
- ఒక్కో వలకు కనీసం రూ.3 వేల వరకు వెచ్చిస్తున్నారు.
- ఈలెక్కన మొక్కలు పెంచుతున్న ఒక్కో నర్సరీకి నీడకోసం రూ.15వేల నుంచి రూ.25 వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తోంది.
- జిల్లాలోని 380 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలకు దాదాపు రూ.కోటి వరకు వెచ్చిస్తున్నారని లెక్కలు చెబుతున్నాయి.



మొక్కలకు రక్షణ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌నెట్లు

- అయితే కొనుగోలు చేస్తున్న షెడ్‌నెట్లలో నాణ్యత లోపిస్తోందని, చిన్నపాటి ఈదురు గాలులు వచ్చినా చిరిగి పోతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.
- ఒకసారి చిరిగిపోతే అవి ఎందుకూ పనికి రాకుండాపోతున్నాయని అంటున్నారు.
- గతేడాది ఈదురుగాలులతో కూడిన వర్షాలకు దాదాపు అన్నిచోట్ల షెడ్‌నెట్లు చిరిగి పోయాయి.
- ప్రస్తుతం నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను ఎండనుంచి కాపాడేందుకు షెడ్‌నెట్లు కొనుగోలు చేయక తప్పడంలేదు.
- అన్నిచోట్ల నెట్లను గ్రామ పంచాయతీ నిధుల నుంచి సమకూర్చుకున్నారు.
- అయితే, నాణ్యత లేకున్నా షెడ్‌నెట్లు కొనుగోలు చేస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు తీవ్రంగా వస్తున్నాయి.

నాణ్యమైనవి కొనుగోలు చేస్తే ప్రయోజనం..

ఒకఏడాది కొనుగోలు చేసిన షెడ్‌నెట్లు రెండోఏడాదికి పనికిరాకుండా పోతున్నాయి. దీనికితోడు గాలులకు చిరిగిపోతున్నవి కూడా చాలా ఉంటున్నాయి. వీటికి ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. ఏటా ఇలా అనవసరంగా నిధులు వెచ్చించే బదులు శాశ్వత ప్రాతిపదికన ఒకేసారి నాణ్యమైన షెడ్‌నెట్లు కొనుగోలు చేయాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. ప్రైవేటుగా నర్సరీల నిర్వాహకులు.. మొక్కలకు నీడ కల్పించేందుకు ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామ పంచాయతీ నర్సరీల్లోనూ నాణ్యమైనవి ఏర్పాటు చేయాలనే ఆలోచన చేయకపోవడం విస్మయం కలిగిస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

పంచాయతీల నుంచే కొనుగోలు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచుతున్న మొక్కలకు ఎండకాలంలో నీడ కల్పించేందుకు షేడ్ నెట్లు వినియోగిస్తున్నాం. ఈ నెట్లను గ్రామ పంచాయతీల నిధులు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. వీటి కొనుగోలులో అధికారుల ప్రమేయం లేదు. నాణ్యత ఉన్న షేడ్‌నెట్లను కొనుగోలు చేయాలని పంచాయతీ అధికారులు, సిబ్బంది, సర్పంచులకు సూచిస్తున్నాం. శాశ్వత ప్రాతిపదికన నెట్లను ఏర్పాటు చేయాలన్న విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కొన్ని గ్రామ పంచాయతీల్లో గతేడాది కొనుగోలు చేసినవి, చిరిగి పోకుండా ఉన్న షేడ్‌నెట్లనే వినియోగిస్తున్నారు.

– లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

క్లుప్తంగా

ఐడీకార్డులు ధరించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: పదో తరగతి పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు ప్రతిఒక్కరూ ఐడీకార్డులు తప్పకుండా ధరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికావద్దని, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. సమావేశంలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జగిత్యాలకు ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల : ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత శనివారం జగిత్యాలకు రానున్నారు. నియోజకవర్గ పద్మనాయక కల్యాణ మండపంలో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరుకానున్నారు. ముందుగా ఉప్పరిపేట నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

షర్మిల అరెస్టు సరికాదు



మాట్లాడుతున్న రాజమ్మ

ధర్మపురి : టీఎస్పీటీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ విషయంలో నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల అరెస్టును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపల్లి రాజమ్మ ఖండించారు. ధర్మపురిలో శుక్రవారం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శనమని, టీఎస్‌పీఎస్సీ ముట్టడికి వెళ్తుండగా అరెస్టు చేయడం సరికాదన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నరేందర్ రావు

జగిత్యాల : శాసనమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన ఏవీఎన్.రెడ్డిని జగిత్యాలకు చెందిన తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్ రావు సత్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు.

శోభాయాత్ర



శోభాయాత్ర పాల్గొన్న హనుమాన్ దీక్షాపరులు

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామంలో శుక్రవారం హనుమాన్ దీక్షాపరులు సీతారామస్వామి సహిత ఆంజనేయస్వామి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. రామాలయం నుంచి గ్రామంలోని పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసరి రవి, హనుమాన్ దీక్షాపరులు జుంబర్తి జితేందర్, మల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

పంట చేతికందేనా..!

- డి-53 కాలువకు నీటి సరఫరా నిలిపివేత
- ఏడు తడులు పూర్తి, మరో రెండు తడులు ఇవ్వాలంటున్న రైతులు
- కాలువకింద 49,815 ఎకరాల్లో వివిధ పంటలు
- ప్రస్తుతం ఎస్సారెస్పీలో 28 టీఎంసీల నీరు



గొలుసు దశలో ఉన్న వరి పొలం



తాటిపల్లి వద్ద కాకతీయ ప్రధాన కాలువ నుంచి డి-53 కాలువకు వచ్చే నీరు

సారంగాపూర్ : శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు కింద మరో రెండు తడులు ఇస్తేనే వరి పంట పండుతుందని రైతులు తెలుపుతున్నారు. కాకతీయ కాలువ పరిధిలోని డి-53 కాలువకు ఏడు తడులు పూర్తికావడంతో నీటి విడుదలను శుక్రవారం నిలిపివేశారు. శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు కింద ఆన్‌అండ్‌ఆఫ్ విధానంలో ఇప్పటికీ 7 తడుల నీరందించారు. మరో రెండు తడులు సాగునీరందిస్తే పూర్తిస్థాయిలో వరితో పాటు ఇతర పంటలు పండుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

49,815 ఎకరాల్లో పంటల సాగు

డి-53-కాలువ పరిధిలో సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్, జగిత్యాల, ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల కింద ఈ యాసంగికి 49,815 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగుచేశారు. ఇందులో ఎక్కువ విస్తీర్ణంలో వరిపంటనే సాగుచేశారు. ప్రస్తుతం పంట పొట్టదశ, గొలుసు దశలో ఉంది. ఏప్రిల్ చివరి వరకు నీరందిస్తేనే పంటచేతికి వస్తుంది.

ఎస్సారెస్పీలో 28 టీఎంసీలు

ఎస్సారెస్పీలో ప్రస్తుతం 28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇందులో 10 టీఎంసీల నీరు డెడ్‌స్టోరేజీ కింద ఉండిపోతుంది. మిగిలిన నీటిలో సరస్వతి కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 300, కాకతీయ ప్రధానకాలువ కింద 3500 నుంచి 5,500 క్యూసెక్కుల నీటిని పెద్దపల్లి వైపు విడుదల చేస్తున్నారు. అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 540 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కింద తాగునీటికి రోజూ 152 క్యూసెక్కులు, ఎవరపేషన్ కింద వృథాగా రోజుకు 400 క్యూసెక్కులు నీరు అవసరముంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

రోజూ వెయ్యి క్యూసెక్కులు విడుదల చేయాలి..

డి-53 కాలువ పరిధిలోని పంటలకు నీరందించేందుకు కాకతీయ ప్రధాన కాలువ నుంచి డి-53 కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని వదిలితే కాలువ చివరి ఆయకట్టు వరకు నీరందే అవకాశం ఉంది. ఆన్‌అండ్‌ఆఫ్ విధానంలో మరో రెండు తడులు ఇస్తే ఏప్రిల్ చివరి వరకు నీరందుతుంది. రోజూ వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

కాలువ నీటిపైనే ఆధారం..



వరిపంటకు మరో రెండు తడులు అందిస్తే డి-53 కాలువకింద పంటలు పండుతాయి. బావుల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటడంతో కాలువ నీటిపైనే ఆధారం పడి ఉన్నాం. కాలువకు నీరు రాకపోతే పంటలు ఎండిపోతాయి.

– బందారి వెంకటేశ్, రైతు, పెంబట్ల

పొట్టదశలో ఉంది



వరి పొట్టదశ, గొలుసు దశలో ఉంది. కనీసం రెండు తడులు ఇస్తేనే పంట పూర్తిగా పండుతుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే పెట్టుబడి కూడా రావడం కష్టంగా ఉంటుంది.

– కాలగిరి మధుసూదన్, సారంగాపూర్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



డి-53 కింద పంటలకు నీరిందించేందుకు కనీసం మరో తడి అందించాల్సి ఉంది. ఉన్నతాధికారులకు నివేదించి నీటి తడులను పొడిగించే విషయం, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు

– దీటీ చక్రూనాయక్, నీటిపారుదల శాఖ

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీపాల్‌రెడ్డి



శ్రీపాల్‌రెడ్డి



రామకృష్ణారావు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానం కోసం శుక్రవారం జరిగిన ఎన్నికల్లో కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి 86 ఓట్లు సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఎర్ర నర్సయ్యకు 68 ఓట్లు వచ్చాయి. 18 ఓట్ల తేడాతో శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి గంగాధర ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి సంజీవరెడ్డి తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నికైంది వీరే..

కాగా, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా చీటి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శిగా అందె మారుతి, ఉపాధ్యక్షుడిగా సిరిపురం మహేంద్రనాథ్, మహిళా కార్యదర్శిగా పుప్పాల వనిత, గ్రంథాలయ కార్యదర్శిగా కర్నె హరిదాసు, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా పోట్టవత్తిని సతీశ్ ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులుగా గుడికందుల మహేశ్, అల్లె పురుషోత్తం, శ్రీరాం కరుణాకర్, నీరటి వెంకటేశ్, కొత్తపల్లి గంగారాజం, రాచకొండ విజయ్‌కృష్ణ, రాజేశుని జీవన్, కంచి సురేశ్, బొల్లె రమేశ్, ఎండీ సలీంను ఏకగ్రీవం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడకు చెందిన సుద్దాల పద్మ (50) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో బ్లీచింగ్ పౌడర్ నీటిలో కలుపుకొని తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందిందని మృతురాలి భర్త అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో కవులు, కళాకారులను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంగడి బజారులో శుక్రవారం నిర్వహించిన గానకోకిల కళానికేతన్ 31వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గానకోకిల కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా 15 మందికి ప్రతిభాపురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, ఐఎంఏ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు బోనగిరి దేవయ్య, రాజేంద్రప్రసాద్, చిట్ల రవి, వాసాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు



అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

ధర్మపురి : ఆగి ఉన్న బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ధర్మపురిలోని కళాశాలకు వెళ్లేందుకు శుక్రవారం దొంతాపూర్‌కు చెందిన ప్రేమలత అనే విద్యార్థిని ఆటోలో దిగి మగ్గిడి కళాశాల ఎదుట బస్సుకోసం వేచి ఉంది. పక్కనే మరో వ్యక్తి ద్విచక్రవాహనాన్ని ఆపాడు. ఎదురుగా బైక్‌పై వచ్చిన మరో యువకుడు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రేమలతకు తీవ్రగాయాలుకాగా, రంగసాగర్‌కు చెందిన తిరుపతి, ఆరెపెల్లికి చెందిన రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ఫీజు చెల్లించలేదని బస్సులోంచి దించేశారు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): స్కూల్ ఫీజు కట్టలేదని ఓ విద్యార్థినిని పాఠశాల బస్ నుంచి దించేసిన ఘటన తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలిక తంగళ్లపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులు ఫీజు చెల్లించలేదు. శుక్రవారం స్కూల్ బస్సుఎక్కిన చిన్నారిని డ్రైవర్ బయటకు దించేశాడు. దీంతో చిన్నారి కంటతడి పెట్టుకుంది. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా సమాధానం ఇవ్వలేదు. జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గొల్లపల్లి : రోడ్డు ప్రమాదంలో వెల్గటూర్ మండలం.. పడకల్ గ్రామానికి చెందిన రాపోలు రామచంద్రం (57) మృతిచెందినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. రామచంద్రం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గొల్లపల్లి మండలం బొంకూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత



మాట్లాడుతున్న హిందూ వాహిని నాయకులు

కొండగట్టు (చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంపై ఉన్న కిరాణా దుకాణంలో గుట్కా అమ్ముతుండగా శుక్రవారం కొడిమ్యాల మండల హిందూవాహిని నాయకులు పట్టుకున్నారు. దీనిపై ఈవోకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా లేకపోవడంతో ఏఈవో బుద్ది శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే టెండర్ రద్దు చేసి కేసునమోదు చేయాలని డిమాండ్ చేయడంతో ఏఈవో దుకాణాన్ని మూసివేయించారు. ఇక్కడ హిందూవాహిని కొడిమ్యాల మండల అధ్యక్షుడు కోల అనిల్‌గౌడ్, కార్యకర్తలు అరవింద్, నిఖిల్, వికాస్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల బాక్సులు ధ్వంసం



కిందపడిన బాక్సులు

ధర్మపురి : మండలంలోని నక్కలపేటలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల బాక్సులను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామంలోని గాంధీ, హనుమాన్ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల ఆన్‌ఆఫ్ బాక్సులను ధ్వంసంచేసి విద్యుత్ వైర్లను బయటపడేశారు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

ధర్మపురి : పట్టణంలో బుధవారం ఎన్నికైన బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సాయంత్రం సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అలుక వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రౌతు రాజేశ్, జాయింట్ సెక్రెటరీగా బందెల రమేశ్, లిటరరీ సెక్రెటరీగా రామడుగు రాజేశ్ ఈసీ మెంబర్లు తదితరులు కోర్టు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్, సీనియర్ న్యాయవాదులు గడ్డం లింగారెడ్డి,, దుమ్మెన శ్రీనివాస్, తదితరులున్నారు.

మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

ధర్మపురి : కాంగ్రెస్ కౌన్సిలర్లపై అధికార పార్టీ కౌన్సిలర్లు చేసిన వ్యక్తిగత దూషణలకు నిరసనగా మున్సిపల్ సాధారణ సమావేశాన్ని బహిష్కరించినట్లు కాంగ్రెస్ కౌన్సిలర్లు తెలిపారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. కమిషనర్ రమేశ్, ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలోనే కాంగ్రెస్ కౌన్సిలర్లు జక్కు పద్మ, సంగనభట్ల సంతోషి, గరిగె అరుణపై చైర్ పర్సన్, వైస్ చైర్మన్, అధికార పార్టీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా దాడి చేశారంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు వాపోయారు. మూడురోజుల కింద నిర్వహించిన మున్సిపల్ సమావేశానికి తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని, మహిళా కౌన్సిలర్లకు బదులుగా వారి భర్తలు సమావేశానికి ఎలా అనుమతించారంటూ ప్రశ్నించారు. సమావేశంలో ప్రతి అంశంపై ప్రశ్నించే హక్కు ఉంటుందని కాంగ్రెస్ కౌన్సిలర్ సంతోషి అన్నారు. తాగునీరు, వీధికుక్కల బెడద, పార్కింగ్, పెండింగ్ బకాయిలు, తదితర అంశాలపై ప్రశ్నిస్తున్నందుకు ఎదురుదాడికి దిగారన్నారు.

శాంతియుత ఆందోళనపై ఉక్కుపాదమా?

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సారంగాపూర్(జగిత్యాల): ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్యం కమ్ముకుని తమపంటలు దెబ్బతింటాయని, ఊళ్లు ఎడారులుగా మారుతాయనే ఆందోళనతో రైతులు శాంతియుతంగా ధర్నా చేస్తే ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయిస్తోందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ స్థాపనకు మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్గటూరు మండలం స్తంభంపల్లిలో శుక్రవారం భూమిపూజ చేశారు. అయితే, పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్తంభంపల్లితోపాటు పాశిగామ గ్రామస్తులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. వారికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మద్దతుగా నిలిచారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేసి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంతపూచీకత్తుపై సాయంత్రం ఆయనను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు శాంతియుతంగా చేస్తున్న ధర్నాలో తాను పాల్గొంటే ప్రభుత్వం భయపెట్టేందుకు అరెస్టులకు పూనుకుంటోందన్నారు. పోలీసులతో అధికార పార్టీ నాయకులు కుమ్మక్కయి అరెస్టు చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన వెంట బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కోండ్ర రాంచంద్రారెడ్డి, చెర్పూరి సుభాష్, నాయకులు కాలగిరి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

వైద్యం కోసం రూ. 1.21 లక్షలు సాయం



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను చూపుతున్న సునంద

ధర్మపురి : ఓ నిరుపేద దంపతులకు ఫేస్‌బుక్ మిత్రులు రూ. 1.21 లక్షలు సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... తిరుపతి జిల్లా వెంకటగిరి మండల కేంద్రానికి చెందిన యాల్ల నాగరాజు, సునంద దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురుకు కొన్నేళ్ల క్రితం వివాహం కాగా చిన్న కూతురితో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఆరేళ్ల క్రితం నాగరాజుకు నరాలకు సంబంధించి వ్యాధితో బాధపడుతున్నాడు. భార్యకు శస్త్ర చికిత్సకు యాభై వేలు అవసరముండగా ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేదు.

ఫేస్‌బుక్ పోస్టుకు స్పందన

నిరుపేద దంపతుల సమస్యను ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ అక్కడి మిత్రుల ద్వారా తెలుసుకొని మార్చి 4న ఫేస్‌బుక్‌లో పోస్టుచేశాడు. సాయం అందించాలని కోరుతూ సునంద బ్యాంకు ఖాతాను పొందుపర్చాడు. దీనికి స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్నాటకకు చెందిన బల్లారి మిత్రులు ఇతరులు కలిసి రూ.1.21 లక్షలు సాయం అందించారు. రూ.20 వేలు సునంద పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా మిగిలిన డబ్బులు వైద్యం, ఇతర అవసరాల కోసం ఉపయోగపడతాయని రమేశ్ తెలిపాడు.

ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులను శిక్షించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల టౌన్ : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, చైర్మన్ జనార్దన్ రెడ్డి బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ యాస్మిన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, 30 లక్షల మంది యువత భవిష్యత్తును రోడ్డున పడేసిందని ఆరోపించారు. ఇక్కడ రాపర్తి రవి, రాజేంద్రప్రసాద్, షికారి గోపికృష్ణ, తదితరులున్నారు.

రాహుల్ గాంధీకి అండగా నిలవాలి

- పీసీసీ కార్యదర్శి జగదీశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

జగిత్యాలటౌన్ : రాహుల్ గాంధీకి అండగా నిలిచి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు నడుం బిగించాలని పీసీసీ కార్యదర్శి జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీని పార్లమెంటులో ఎదుర్కొనే దమ్ములేకనే అనర్హత వేటు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోడోయాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి మోదీ ప్రభుత్వం అనర్హత వేటు వేశారని ఆరోపించారు. శిక్షలు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. మోదీ ప్రధాని కాకముందు ఆదాని ఆస్తులు 23వేల కోట్లు కాగా ప్రస్తుతం అవి 19 లక్షల కోట్లకు చేరడం నిజంకాదా అని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టంచేశారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు కల్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, మన్సూర్, పుప్పాల అశోక్, జగదీశ్వర్ చాంద్‌పాషా, తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జగిత్యాల టౌన్ : ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చిన బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఎస్సీలను మోసం చేసిందని మహజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ పిలుపుమేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 ఏళ్లుగా విద్యా, ఉద్యోగ, ఉపాధి, వివిధ రంగాల్లో పూర్తిగా వెనుకబాటుకు గురయ్యామన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేపట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేకపోతే రానున్న ఎన్నికల్లో తగుమూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇక్కడ ఎంఎస్పీ కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సురుగు శ్రీను, సురేశ్, తదితరులున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ వద్ద శుక్రవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. కోరుట్లకు చెందిన పూసల వెంకటేశ్, గొడికె నవీన్ నిర్మల్ నుంచి గంజాయిని కొనుగోలు చేసుకుని వచ్చి తడపాకల్ గోదావరి నది తీరంలో విక్రయిస్తున్నారని తమకు సమాచారం అందగా దాడిచేసి పట్టుకున్నామని వెల్లడించారు. ఇద్దరు యువకుల వద్ద 400 గ్రా. గంజాయి లభ్యమైందని, విక్రేతలను పట్టుకోవడంలో సహకరించిన ఏఎస్సై ఇస్మాయిల్, కానిస్టేబుళ్లు విజయ్, గంగాధర్, హోంగార్డు జగదీశ్‌ను ఎస్సై అభినందించారు. తహసీల్దార్ జనార్దన్ సమక్షంలో నిందితులను విచారించి కోర్టులో హాజరుపర్చామని ఎస్సై చెప్పారు.

కొండగట్టులో దుకాణాలకు వేలం

కొండగట్టు (చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ దుకాణాలకు సంబంధించి ఈనెల 16న నిర్వహించిన వేలంలో వాయిదపడిన దుకాణాలకు శుక్రవారం ఏఈవో బుద్ది శ్రీనివాస్ సమక్షంలో వేలం నిర్వహించారు. పూలు, పండ్లు మరుగుదొడ్లు, ఫొటో స్టూడియోకు వేలం నిర్వహించగా టెంట్‌హౌజ్ సామాను భద్రపరచు గది కోసం వేలం వాయిదపడింది. ఈ టెండర్లలో ఈవో టి.వెంకటేశ్, చైర్మన్ మారుతిస్వామి, టెండర్‌దారులు తదితరులు పాల్గొన్నారు.